క్లుప్తంగా

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలు

సీతంపేట: ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, వెల్డర్, కోపా, డ్రెస్‌మేకింగ్ ట్రేడ్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. 10 శాతం ఖాళీలను మేనేజ్‌మెంట్ కోటాలో ఐఎంసీ ద్వారా భర్తీచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆగస్టు 1వ తేదీలోగా సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకోవాలని సూచించారు. అనంతరం 3వ తేదీన సీతంపేట ఐటీఐలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 7169062449, 9948582309 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్: ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని వైద్యులు, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని అన్నవరం, ఎం.సింగిపురం పీహెచ్‌సీలకు సంబంధించి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి, వాటి అమలుకు కృషిచేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మరింత మెరుగ్గా వైద్య సేవలందించాలని సూచించారు. సమావేశం సర్పంచ్‌లు గవర రాజశేఖర్, గోగుల కళ్యాణి, వైద్యులు వి.కమలనాథ్, కె.చిరంజీవి తదితరులున్నారు.

నేడు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం: మండలంలోని పాడిపంచాయతీ పరిధిలో రెండు రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు సోమవారం తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.50 లక్షలతో పాడి ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి సంతోషపురం గ్రామం వరకు 1.7 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.1 కోటి 50 లక్షలతో సంతోషపురం నుంచి మీగడ గిరిజన గ్రామం వరకు 2 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం: మండలంలోని జోగిరాజుపేట జంక్షన్ నుంచి కిచ్చాడ గ్రామానికి చేపడుతున్న బీటీరోడ్డు పనులను ఎంపీపీ శెట్టి పద్మావతి సోమవారం పరిశీలించారు. రూ.1కోటి 42 లక్షలతో 2.8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ రహదారి నిర్మాణంతో పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్‌చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన మెనూ అమలు చేస్తున్నారా లేదా, సిలబస్ ఎంతవరకు పూర్తయింది, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు అందరికీ అందాయా లేదా అని ఆరాతీశారు. ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెంటినెన్స్ పనులు చేపడుతున్నందున సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ప్రజానీకానికి మౌలిక సదుపాయాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల అనేక వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ పురపాలక సంఘం ప్రజానీకానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూరుస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని 28వ వార్డు చినదేవర వీధిలో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో జరుగుతున్న సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేసి కాలువల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని, అలాగే మురుగునీరు, వరద నీరు ఎక్కడా నిల్వ లేకుండా ఉండేలా నిర్మాణం చేపట్టాలని చెప్పారు. కాలువల నిర్మాణానికి స్థానిక ప్రజలంతా సహకరించి తమ నివాసాల ముందు గల చిన్న చిన్న కట్టడాలను తొలగించి సాఫీగా జరిగేలా దగ్గర ఉండి పనులు పర్యవేక్షిస్తున్న స్థానిక కౌన్సిలర్ కృషిని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్‌లు మజ్జి శశికర్, కొరాడ శ్రీనివాసరావు (నాని) అర్ చిన్నంనాయుడు, కో ఆప్షన్ సభ్యులు ఎం.వెంకటరమణ, సీనియర్ నాయకులు రెడ్డి రవికుమార్, ఎస్వీఎస్ఎన్ రెడ్డి, పి.శ్రీనివాసరావు, ఎస్. ప్రకాశ్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ముఖ్యమంత్రిని దీవించాలి



సంక్షేమపథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని లబ్ధిదారులు, ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం మండలం సుమిత్రాపురంలో సర్పంచ్ బొత్స నందిని ఆధ్వర్యంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అందులో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికివెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.అలాగే ఇంటింటికీవెళ్తున్న సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వసంక్షేమ పథకాల పంపిణీపై ఆరాతీశారు.

కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ మండల నాయకులు బి.శ్రీరాములు పార్థసారథి, వై గోపాలనాయుడు, రెడ్డి అప్పలనాయుడు, వివిధగ్రామాల సర్పంచ్‌లు ఎం.సుశీల, జి.అన్నంనాయుడు, బి. శ్రీనివాసరావు, కురమాన శ్రీనివాసరావు, కృష్ణారాయపురం మాజీ సర్పంచ్ జి.అన్నంనాయుడు, మాజీ సర్పంచ్ బి.గౌరునాయుడు,వెలుగు, ఉపాధి హామీ పథకం సహాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గ్రామసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలోని సూరంపేట సచివాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పర్యవేక్షణలో నిర్వహించే జగనన్న సురక్ష గ్రామసభను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం సూరంపేట సచివాలయంలో ఈఓపీఆర్డీ కుమారవర్మ అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఉన్న చిన్నారాయుడుపేట, సూరంపేట,మరిపవలస గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నామని, వలంటీర్లు నిర్వహించిన సర్వేలో గుర్తించిన అర్హులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ అప్పలనర్సమ్మ, ఎంపీటీసీ బి.వరలక్ష్మి, గ్రామ పెద్దలు, గృహసారథులు పాల్గొన్నారు.

జానుమల్లువలసలో ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు



ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని జానుమల్లువలసలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని నిర్వాహకులను ఏఈ పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన గ్రామంలో మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాలకు ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు మంజూరవుతాయని తెలిపారు. అలాగే జేజేఎం నిధులతో 35 గ్రామాలకు ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావస్తున్నాయని, ఇప్పటికే 10 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వింకటనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వై.అప్పలనాయుడు దామోదర్ నాయుడు, శివున్నాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాల్సిందే..

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు



ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న మందులను పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

పాలకొండ రూరల్: వైద్యారోగ్య శాఖ సూచించిన నిబంధనలను ప్రైవేటు ఆస్పత్రుల్లో కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. పాలకొండలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లను వైద్య బృందంతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నబాబు మదర్ అండ్ చైల్డ్ కేర్, గాయత్రీ చిల్డ్రన్ కేర్, డాక్టర్ మాధవరావు ఆస్పత్రితో పాటు శ్రీమణికంఠ ల్యాబ్‌ను పరిశీలించారు. అక్కడి వార్డులు, రోగులకు అందిస్తున్న సేవలు, వైద్య పరీక్షల నిర్వహణ, వాటి నాణ్యతపై ఆరాతీశారు. ముఖ్యంగా స్కానింగ్ యంత్రాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. పిల్లలు, గర్భిణుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలు సూచించే పోస్టర్లు విధిగా పదర్శించాలన్నారు. ఓపీ రికార్డులు, అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు కచ్చితంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నోటిఫైడ్ (ప్రత్యేక) వ్యాధులు గుర్తిస్తే వెంటనే (ఐహెచ్‌ఐపీ) పోర్టర్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం 4వ వార్డులో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ జయాగౌడ్ తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాధి జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొండాపురం గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. విలేజ్ హెల్త్ క్లీనిక్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, హైరిస్క్ రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దేవిపార్వతి, ఏఎస్ఎం కుమారి, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్రీనివాసరావు ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్ వద్ద ఉన్న సత్యసాయి అన్నదాన సత్రంకు వీరఘట్టంకు చెందిన వూణ్న శ్రీనివాస్ రూ.1 లక్ష విలువ గల ఫ్రీజర్ బాక్స్‌ను వితరణ చేశారు. తన తల్లిదండ్రులు వూణ్న ఈశ్వరుడు, విమల దంపతుల జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను వితరణ చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నేతాజీనాయుడు సోమవారం ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభించారు. ఎవరైనా మరణిస్తే దూరప్రాంతాల్లో ఉన్న వారి బంధువులు వచ్చేంత వరకు పార్థివదేహాన్ని సురక్షితంగా ఉంచేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. వీరఘట్టంతో పాటు సమీప గ్రామాలకు దీన్ని అందుబాటులో ఉంచుతామన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం ప్రారంభం

గరుగుబిల్లి: మండల పరిధిలోని ఎస్‌బీఐ ఖాతాదారులకు ఏటీఎం సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఏఏ హసీబ్ అన్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ ఖాతాదారులు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ బి.రమేష్‌కుమార్, బీఎం హేమంత్‌కుమార్, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

భామిని: మండలంలోని అత్తికొత్తూరులో డెంగీ కేసు నమోదు కావడంతో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో నెయ్యిగాపుల సౌజన్య అనే విద్యార్థినికి డెంగీ లక్షణాలు బయటపడడంతో చికిత్స అందిస్తున్నారు. ఈఓపీఆర్డీ గుర్ల కృష్ణారావు, బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, సబ్‌యూనిట్ అధికారి పి.అప్పారావు, కార్యదర్శి బి.నాగేష్ సోమవారం గ్రామాన్ని సందర్శించి బాధితురాలి ఇంట్లో దోమల నివారణ మందుల పిచికారీ చేయించారు. కుటుంబ సభ్యుల రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. గ్రామంతో పాటు విద్యార్థిని చదువుతున్న ఏపీ మోడల్ స్కూల్‌లో కూడా దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

బొడ్డగూడలో పోలింగ్ బూత్ ఏర్పాటు

భామిని: మండలంలోని బొడ్డగూడ గిరిజన గ్రామంలో ప్రత్యేక ఎన్నికల బూత్ ఏర్పాటు చేయాల్సి ఉందని తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ చంద్రరావు జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావుకు సోమవారం విన్నవించారు. ఓటర్ల చేర్పులపై నిర్వహించిన ఈసీలో ప్రతిపాదించారు. బొడ్డగూడ సచివాలయం పరిధిలో గల 12 గిరిజన గ్రామాలకు చెందిన ఓటర్లను భామిని బూత్ నుంచి విడదీసి బొడ్డగూడ బూత్‌కు కేటాయించాల్సిన ఆవశ్యకతను వివరించారు. దీనికి జేసీ ఆమోదం తెలిపారు.

80 మందికి కంటి పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్ వద్ద ఉన్న సత్యసాయి నిత్యాన్నదాన సత్రం వద్ద సోమవారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 80 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వారిలో 43 మందికి శస్త్రచికిత్స అవసరమైనిగుర్తించారు. వారిని విశాఖపట్నంలోని ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. వీరందరికీ మంగళవారం ఉచితంగా కంటి ఆపరేషన్ చేయనున్నట్లు అన్నదాన సత్రం కన్వీనర్ నడిమింటి సీతంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో వావిలపల్లి నారాయణరావు, తూముల గౌరునాయుడు, స్వామినాయుడు, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నేత్ర శిబిరానికి వచ్చిన అందరికీ ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

రుచికరమైన ఆహారాన్ని అందించండి



పెదపెంకి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థులకు మంచి రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈఓ సామల సింహాచలం కోరారు. ఈ మేరకు పెదపెంకి ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించి డిజిటల్ విద్యాబోధనపై తగు సూచనలు చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి చేతిరాతపై మెలకువలు తెలియజేశారు. మంచి రాత ఉంటే మంచి మార్కులు వస్తాయన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వంటలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై అవగాహన పెంపొందించుకోవాలి..



రైతుకు బహుమతి అందిస్తున్న పశువైద్యాధికారులు

మక్కువ: లేగదూడల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశువైద్యాధికారి ఎంవీ జగదీష్‌కుమార్, మక్కువ పశువైద్యాధికారి కె..పోలండొర అన్నారు. మండలంలోని కన్నంపేటలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు జగదీష్‌కుమార్, పోలండొరలు లేగదూడల పెంపకంపై రైతులుకు అవగాహన కల్పించారు. ఆడ లేగదూడ సరైన పాడిపశువుగా ఎదగాలంటే నులిపురుగుల నివారణ మందు తప్పక వేయించాలన్నారు. ప్రదర్శనలో 30 లేగ దూడలను ప్రదర్శించగా, వాటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దూడల పెంపందారులకు సర్పంచ్ బలగ సావిత్రమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీఓ బి.శ్యామలాదేవి, వెటర్నరీ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోగా నిర్మాణాలు పూర్తి



అనసబద్రలో ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే

- ట్రైబుల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే

మక్కువ: ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులు ఆగస్టు 15 నాటికి పూర్తిచేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే ఆదేశించారు. మండలంలోని అనసబద్ర గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఎన్ని భవనాలు నిర్మాణమయ్యాయి? ఎప్పటిలోగా పూర్తవుతాయి అన్న విషయాలను ఐటీడీఏ ఎస్ఈ శాంతేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణాలు వచ్చే నెల 15 నాటికి పూర్తిచేసి, రహదారులు నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్, ఈఎన్‌సీ ఎస్.శ్రీనివాసరావు, డీఈ మణిరాజ్, ఏఈ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 151 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 151 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. బొమ్మిక జీటీడబ్ల్యూహెచ్‌ఏ పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనుల్లో నిధులు దుర్వినియోగం జరిగినట్లు గిరిజన సంఘం నాయకులు డి.లక్ష్మీనారాయణ పీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని కోరారు. చెక్‌డ్యాం నిర్మించాలని కోరుతూ పెద్దూరు సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి వినతిపత్రం అందజేశారు. అలాగే అటవీపట్టా మంజూరు చేయాలని కుడ్డపల్లికి చెందిన కూర్మారావు, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు ఇప్పించాలని కోడిపిల్లల గూడకు చెందిన సుస్మిత, ఆశాకార్యకర్త పోస్టు ఇప్పించాలని కొత్తబాలేరుకు చెందిన చిన్నారి అధికారులను కోరారు. హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని, సీసీరోడ్డు నిర్మించాలని, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ పలు వినతులు అందాయి. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈఓ ఎ.లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ, సీడీపీఓ రంగలక్ష్మి, హెచ్ఓలు జయశ్రీ, ఆయంతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



జగనన్న ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: మండలంలోని పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో 17 లేఅవుట్లలో 646 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు హౌసింగ్ ఏఈ వి.వినోద్ తెలిపారు. అలాగే సొంత స్థలాలు ఉన్న 149 మందికి జగనన్న హౌసింగ్ స్కీం క్రింద ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం చిదిమి, రేగులపాడు, హుస్సేనుపురం, తలవరం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వారిలో 87 మందికి తొలి విడత అడ్వాన్స్‌గా రూ.20 వేల చొప్పున చెల్లించినట్లు చెప్పారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు కేటాయించిందని, నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు విడతల వారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. అచ్చెపువలస వద్ద 276 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అయితే అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకురావడం లేదన్నారు. అచ్చెపువలస లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు నీటి సమస్య లేకుండా బోర్ వెల్ తీయాలని ఎంపీపీ సూచించారు. అలాగే ప్రభుత్వం అందించే రాయితీలను లబ్ధిదారులు వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, ఏపీఓ జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.